ప్రమోషన్‌కు నేను రెడీ

- ముఖ్యమంత్రి అవ్వాలనే కోరిక లేకపోవడానికి నేనేమీ సన్యాసిని కాదు కదా!
- కర్ణాటక హోం శాఖ మంత్రి పరమేశ్వర కీలక వ్యాఖ్యలు
- సీఎం మార్పుపై ప్రచారం వేళ ప్రాధాన్యం
- ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నది
- మా ఎమ్మెల్యేలకు రూ.100 కోట్ల ఆఫర్
- గతంలో ఇలానే చేశారన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

హస్తం పార్టీ సీఎం పదవి నుంచి తప్పిస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పరమేశ్వర వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.

బెంగళూరు/హుబ్బళ్లి, ఆగస్టు 30: వరుస కుంభకోణాల నేపథ్యంలో కర్ణాటకలో సీఎం మార్పుపై జోరుగా చర్చ జరుగుతున్న వేళ ఆ రాష్ట్ర హోంమంత్రి జీ పరమేశ్వర శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు ప్రమోషన్‌గా సీఎం పదవి ఇస్తే తప్పక సంతోషిస్తానని పేర్కొన్నారు. బెంగళూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ సీఎం కావాలనే కోరిక లేకపోవడానికి తానేమీ సన్యాసిని కాదు కదా! అని వ్యాఖ్యానించారు. పరమేశ్వరకు సీఎం పదవి వస్తే సంతోషిస్తానని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి స్పందిస్తూ 'అదే జరిగితే నేను కూడా సంతోషిస్తాను' అని పేర్కొన్నారు. ముడా స్కాం ఆరోపణలతో పీకల్లోతు ఇబ్బందుల్లో చిక్కుకుపోయిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను

దళిత నేతల్లో అత్యంత సీనియర్ ఆయనే

రాష్ట్రంలో ఒకవేళ సీఎంను మారిస్తే దళిత నేత, హోంమంత్రి పరమేశ్వర రేసులో ముందున్నట్టు ఇప్పటికే వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో సీఎం మార్పు తప్పదనుకొంటే, ఆ పదవిని దళిత నేతకు ఇవ్వాలని సిద్ధరామయ్య వర్గం పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తర్వాత దళిత వర్గానికి చెందిన అత్యంత సీనియర్ నేతగా పరమేశ్వర ఉన్నారు. కాగా, ముడా స్కాంలో సీఎం సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శనివారం నిర్వహించ తలబెట్టిన 'చలో రాజ్‌భవన్' ఆందోళన కార్యక్రమంపై పరమేశ్వర మాట్లాడుతూ గవర్నర్ అనుమతి చట్టవిరుద్ధమని అన్నారు. దీనిపై రాష్ట్ర క్యాబినెట్ ఓ నిర్ణయం తీసుకొన్నదని, దీనికి సంబంధించి అందించిన ఆధారాలను గవర్నర్ పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు.

నన్ను దించేసేందుకు కుట్ర: సీఎం సిద్ధరామయ్య

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, తమ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.100 కోట్ల చొప్పున ఆఫర్ చేస్తున్నదని సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ఆరోపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే రవికుమార్ గౌడ తనకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. 2008, 2019లో కూడా 'ఆపరేషన్ కమలం' ద్వారానే బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు కూడా అదే కుట్రలు చేస్తున్నదని అన్నారు. 136 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం అంత సులభం కాదని, తమ ఎమ్మెల్యేల్లో ఎవరూ కూడా డబ్బులకు లొంగబోరని ఆశిస్తున్నానన్నారు. 16వ ఆర్థిక సంఘంపై సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ చైర్మన్ అరవింద్ పనగరియాను కలిశామని, తమ డిమాండ్లను ఆయన ముందుంచామని తెలిపారు. కాగా, హత్య కేసులో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్‌కు జైల్లో సకల సౌకర్యాలు కల్పించడంపై స్పందిస్తూ.. ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశామని, దర్శన్‌ను బళ్లారి జైలుకు మార్చామని తెలిపారు. ఈ విషయంలో డీజీపీకి కూడా నోటీసులు జారీచేశామన్నారు.

ఆర్థికం 'హస్త'వ్యస్తం!

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షోభ పరిస్థితులు
- హిమాచల్‌ప్రదేశ్‌లో జీతాలు చెల్లించలేని స్థితి
- రెండు నెలలపాటు తాను, మంత్రులు వేతనం తీసుకోబోమని సీఎం సుఖ్వీందర్ ప్రకటన
- కర్ణాటకలో నిధుల కోసం ప్రజలపై భారాలు
- రేవంత్ పాలనలో అప్పుల కుప్పగా తెలంగాణ
- హామీల అమలులో ప్రభుత్వాలు పూర్తి విఫలం

'రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నది. దీని కారణంగా నాతో పాటు క్యాబినెట్ మంత్రులం దరూ రెండు నెలలపాటు వేతనాలు, టీఏ, డీఏ తీసుకోకూడదని నిర్ణయం తీసుకొన్నాం. ఎమ్మెల్యేలను కూడా ఇదేవిధంగా చేయాలని కోరుతున్నా'.. హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు గురువారం చేసిన ప్రకటన ఇది. కాంగ్రెస్ పాలనలోని హిమాచల్‌లో ఆర్థిక సంక్షోభ పరిస్థితులకు సీఎం ప్రకటనే నిదర్శనం. ఒక్క హిమాచల్‌లోనే కాదు, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి.

సిమ్లా/న్యూఢిల్లీ, ఆగస్టు 30: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాలనా వైఫల్యం కారణంగా ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు ఆ వాగ్దానాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్న పరిస్థితులు తెలంగాణ, కర్ణాటక సహా హిమాచల్‌ప్రదేశ్‌లలో కనిపిస్తున్నాయి. ఎడాపెడా అప్పులు చేస్తూ.. ప్రజలపై పలు రకాల చార్జీలు, పన్నుల భారం మోపుతున్నాయి. తాజాగా హిమాచల్‌ప్రదేశ్‌లో కనీసం వేతనాలు చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు గురువారం చేసిన ప్రకటన ద్వారా వెల్లడైంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని సాక్షాత్తూ ఆయనే ఒప్పుకొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనతో పాటు మంత్రులు రెండు నెలల పాటు వేతనాలు, టీఏ, డీఏ వంటివి తీసుకోకూడదని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. రాబోవు రోజుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మంచి మెరుగుదల చూసే వరకు శాసనసభ్యులు కూడా ఇదే విధంగా చేయాలని అభ్యర్థించారు.

రాహుల్ వల్లే ఆర్థిక భయానకం!

కనీసం వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో హిమాచల్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి విమర్శించారు. సీఎం తనతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఎమ్మెల్యేలకు వేతనాలు ఇచ్చుకోలేనంతగా రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని అన్నారు. రాహుల్ గాంధీ 'ఖటా-ఖట్' మాడల్ కారణంగానే రాష్ట్రంలో ఆర్థిక భయానక పరిస్థితులు నెలకొన్నాయని, ఆయన విఫల ఆర్థిక ఆలోచనా విధానాలు బహిర్గతమయ్యాయని విమర్శించారు. కర్ణాటకలో కూడా ఇదే విధమైన పరిస్థితులు నెలకొన్నాయని, పాల నుంచి నీళ్ల వరకు అన్ని నిత్యావసరాల ధరలు పెరిగాయని అన్నారు. ఫేక్ వాగ్దానాలు చేసిన రాహుల్ గాంధీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలో గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఐదు గ్యారెంటీలను నమ్మి ఓటేసిన ప్రజలకు సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ చుక్కలు చూపిస్తున్నది. ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు. గ్యారెంటీలకు అడ్డగోలుగా కోతలు పెడుతున్నది. దీనికితోడుగా పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 4 శాతం పెంచడంతో పాటు పలు రకాల పన్నులు, చార్జీలతో ప్రజలపై భారం వేస్తున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్న భాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

తెలంగాణలో 8 నెలల్లోనే రూ.50 వేల కోట్లకు పైగా అప్పు

ఇక తెలంగాణలో అయితే గ్యారెంటీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని హస్తం పార్టీ ప్రభుత్వ వైఫల్యాన్ని అటుంచితే.. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేస్తున్నది. రేవంత్ సర్కార్ కేవలం 8 నెలల్లోనే రూ.50 వేల కోట్లకు పైగా అప్పులు చేసింది. ఒక్క కొత్త ప్రాజెక్టూ లేక, మరోవైపు ప్రజా సంక్షేమమూ లేక తెచ్చిన వేలాది కోట్ల అప్పులు ఎటు పోతున్నాయో తెలియని సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. రుణమాఫీ అంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెగ ఊదరగొట్టిన కాంగ్రెస్.. రుణమాఫీని సక్రమంగా అమలు చేయలేక రైతన్నల ఆగ్రహాన్ని చవిచూస్తున్నది. మరోవైపు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం యువత రోడ్లెక్కుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు

కొత్త పింఛను దరఖాస్తు ఫారం

న్యూఢిల్లీ: పదవీ విరమణ చేసే కేంద్ర ప్రభుత్వోద్యోగుల కోసం కొత్త సరళీకృత పింఛను దరఖాస్తు ఫారాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ శుక్రవారం ఆవిష్కరించారు. 9 వేర్వేరు ఫారాలను కలిపి, ఒకే ఫారంగా రూపొందించారు. దీనిని ఫారం 6ఏ అంటారు. ప్రజలు, పింఛనుదారుల జీవితాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన మరొక చర్య ఇది అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పదవీ విరమణ చేసే కేంద్ర ప్రభుత్వోద్యోగులకు భవిష్య / ఈ-హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్స్‌లో ఈ ఫారం-6ఏ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

బీజేపీలో చేరిన చంపయీ సొరేన్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం సీనియర్ నేత చంపయీ సొరేన్ శుక్రవారం బీజేపీలో చేరారు. రెండు రోజుల క్రితమే జేఎంఎం పార్టీకి రాజీనామా చేసిన ఆయన.. పలువురు నేతలు, మద్దతుదారులతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో కమలం తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీలో చంపయీ చేరికతో గిరిజన వర్గాల్లో తమ పార్టీకి పట్టు లభిస్తుందని, ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల్లో తమకు లబ్ధి చేకూరుతుందని కమలం పార్టీ భావిస్తున్నది.

అస్సాం అసెంబ్లీలో నమాజ్ విరామం రద్దు

గువాహటి : అస్సాం శాసనసభ సమావేశాలు జరిగేటపుడు ప్రతి శుక్రవారం ముస్లిం ఎమ్మెల్యేలు నమాజ్ చేయడం కోసం సభ కార్యకలాపాలకు రెండు గంటలపాటు విరామం ఇచ్చే నిబంధనను రద్దు చేసినట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. రెండు గంటలపాటు ఇస్తున్న జుమ్మా విరామాన్ని రద్దు చేయడం ద్వారా వలస పాలన కాలంనాటి మరో అవశేషాన్ని వదిలించుకున్నామని, అస్సాం శాసనసభ ఉత్పాదకతకే ప్రాధాన్యమిచ్చిందని శర్మ శుక్రవారం తెలిపారు.

తొలి దళిత రాష్ట్రపతి రామ్‌నాథ్ 'కోవిడ్'

తడబడిన కంగనా రనౌత్.. నెటిజన్ల ట్రోలింగ్

న్యూఢిల్లీ: మండీ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఒక ఇంటర్వ్యూలో తడబడి మరోసారి ట్రోలింగ్‌కు గురయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దేశానికి తొలి దళిత రాష్ట్రపతి అని ఒక ఇంటర్వ్యూలో కంగనా పేర్కొన్నారు. పైగా, రామ్‌నాథ్ కోవింద్‌కు బదులుగా 'రామ్ కోవిడ్' అని పలకడంతో ట్రోలర్లు ఆమెపై మీమ్‌లు, జోక్‌లతో సామాజిక మాధ్యమాలను హోరెత్తించారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కులగణన అంశం గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే దేశానికి మొదటి దళిత రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ అని యాంకర్ సవరించగా, ఆమె వెంటనే తన తప్పును అంగీకరించారు.

యువ న్యాయవాదులకు ఆదర్శం

జస్టిస్ హిమా కోహ్లీకి సీజేఐ ప్రశంస

న్యూఢిల్లీ: నేటి యువ న్యాయవాదులకు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులకు జస్టిస్ హిమా కోహ్లీ రోల్ మోడల్‌గా నిలుస్తారని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ప్రశంసించారు. ఈ వృత్తిలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆమె గళం ప్రస్తావించిందన్నారు. పదవీ విరమణ చేస్తున్న సుప్రీంకోర్టు జడ్జి హిమా కోహ్లీ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమె న్యాయపాలన కోసం నిలబడిన వ్యక్తి, వృత్తిలో ప్రభావశీలి అని పేర్కొన్నారు. ఆమె సున్నితత్వ, న్యాయపరమైన నిర్ణయాలను ప్రశంసించారు. మూడేండ్లకు పైగా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ హిమా కోహ్లీ సెప్టెంబర్ 1న పదవీ విరమణ చేయనున్నారు.

శివాజీకి శిరస్సు వంచి క్షమాపణ చెప్తున్నా

విగ్రహం కూలిపోవడంపై ప్రధాని మోదీ స్పందన

ముంబై,ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో ఇటీవల శివాజీ విగ్రహం కూలడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం క్షమాపణ చెప్పారు. 'ఛత్రపతి శివాజీ కేవలం ఒక పేరు లేదా ఒక చక్రవర్తి కాదు. మనకు ఆయన ఒక దైవం. ఇవాళ నేను నా శిరస్సును నా దైవం పాదాల ముందు వంచి క్షమాపణ అడుగుతున్నా' అని మోదీ అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రూ.76 వేల కోట్లతో చేపట్టిన వంధన్ నౌకాశ్రయ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

సిక్కుల ఊచకోతలో టైట్లర్ పాత్రపై ఆధారాలున్నాయ్

అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు ఢిల్లీ కోర్టు శుక్రవారం గట్టి షాక్ ఇచ్చింది. 1984లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కుల ఊచకోత కేసులో ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జగదీశ్ టైట్లర్ పాత్రపై తగిన రుజువులు ఉన్నాయని, హత్య, అల్లర్లు జరగాలనే ఉద్దేశంతో రెచ్చగొట్టడం వంటి నేరారోపణలను నమోదు చేయాలని ఆదేశించింది. ఢిల్లీలోని పుల్ బంగష్ గురుద్వారా వెలుపల ఠాకూర్ సింగ్, బదల్ సింగ్, గురుచరణ్ సింగ్ హత్యలకు సంబంధించిన కేసులో ఈ ఆదేశాలు ఇచ్చింది.

భర్త సమ్మతి లేకుండా గర్భం తొలగింపు క్రూరత్వమే

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్: భర్త సమ్మతి లేకుండా భార్య గర్భాన్ని తొలగించుకోవడం క్రూరత్వం కిందకు వస్తుందని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. క్రూరత్వం, భర్తను విడిచిపెట్టి వెళ్లడం కారణాలతో పిటిషనర్ (భార్య), ప్రతివాది (భర్త)కి విడాకులు మంజూరు చేస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును తాము సమర్థిస్తున్నట్టు చెప్పింది. క్రూరత్వం శారీరక, మానసిక హానిని కలిగిస్తుందని, భర్త అనుమతి లేకుండా గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకోవడం ఈ నిర్వచనం పరిధిలోకి వస్తుందని తెలిపింది.

నైట్ డ్యూటీలంటే వైద్యుల్లో వణుకు

- కోల్‌కతా హత్యాచార ఘటన తర్వాత వైద్యుల్లో భయం
- ఐఎంఏ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటన తర్వాత నైట్ డ్యూటీ అంటేనే మహిళా వైద్యులు భయపడిపోతున్నారట. రాత్రిపూట విధులు తమకు ఎంతమాత్రమూ సురక్షితం కాదని భావిస్తున్నారట. కొందరైతే ఆత్మరక్షణ కోసం ఆయుధాలు కూడా వెంట తెచ్చుకోవాలని భావిస్తున్నారట. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 22 రాష్ట్రాలకు చెందిన 3,885 మంది వైద్యులు ఈ సర్వేలో పాల్గొన్నారు. వీరిలో 85 శాతం మంది 35 ఏండ్లలోపు వారు కాగా, 61 శాతం మంది ట్రైనీ వైద్యులు, పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీలు ఉన్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 24.1 శాతం మంది వైద్యులు నైట్ డ్యూటీ సురక్షితం కాదని చెప్పగా, 11.4 శాతం మంది అస్సలు సురక్షితం కాదని చెప్పారు. ఇలా చెప్పిన వారిలో మహిళలే అధికం. 20-30 ఏండ్ల మధ్య వైద్యులకు అత్యంత తక్కువ భద్రత కలిగి ఉన్నట్టు సర్వే పేర్కొన్నది. వీరిలో అత్యధికులు ఇంటర్న్ చేస్తున్నవారు, పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తున్నవారే.

డ్యూటీ రూములేవి?

నైట్ షిఫ్టులలో తమకు డ్యూటీ రూములు కూడా ఉండడం లేదని 45 శాతం మంది వైద్యులు చెప్పారు. తాము విధులు నిర్వర్తించే వార్డ్/క్యాజువాలిటీ ప్రాంతం నుంచి డ్యూటీ రూములు ఎక్కడో దూరంగా ఉంటున్నాయని సర్వేలో పాల్గొన్న వారిలో సగానికి పైగా (53శాతం) తెలిపారు. అందుబాటులో ఉన్న మూడింట ఒకవంతు డ్యూటీ రూముల్లో అటాచ్డ్ బాత్రూంలు ఉండడం లేదని వివరించారు. దీంతో రాత్రిపూట అవసరాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

రేప్, హత్య కేసుల్లో కఠిన చట్టాలు తేవాలి

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్రవారం ప్రధాని మోదీకి మరోసారి లేఖ రాశారు. క్రూరమైన రేప్, హత్య లాంటి నేరాలకు తీవ్రమైన శిక్షలు విధించేలా కఠినమైన కేంద్ర చట్టాలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

డిమాండ్లు ఇవీ..

రాత్రిపూట విధులు నిర్వర్తించే వైద్యుల రక్షణ కోసం శిక్షణ పొందిన సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతోపాటు సీసీటీవీ కెమెరాలు బిగించాలని, పూర్తిగా వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సర్వేలో పాల్గొన్న వైద్యులు కోరారు. కేంద్ర రక్షణ చట్టం (సీపీఏ) అమలు చేయడంతోపాటు రోగుల అటెండెంట్స్ సంఖ్యను నియంత్రించడం, అలారం వ్యవస్థను ఏర్పాటు చేయడం, తాళాలు వేయగలిగే సురక్షితమైన డ్యూటీ రూములు అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు చేపట్టాలని వైద్యులు డిమాండ్ చేసినట్టు ఐఎంఏ సర్వే వెల్లడించింది.

థీసిస్ అప్రూవల్ తప్పనిసరి కాదు

అది లేకున్నా మెడికల్ ఫైనల్ పీజీ పరీక్షలు రాయొచ్చు: ఎన్‌ఎంసీ

న్యూఢిల్లీ: పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్స్ ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిళ్లను తగ్గించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఫైనల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షలు రాయడానికి థీసిస్ అప్రూవల్ తప్పనిసరి కాదని తెలిపింది. విద్యార్థులు తమ థీసిస్‌ను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, వైద్య కళాశాల డీన్ ద్వారా సమర్పించాలని ఎన్‌ఎంసీ చెప్పింది. ఎన్‌ఎంసీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా వైద్య కాలేజీలకు ఈ మేరకు లేఖ రాశారు. థీసిస్‌కు హెచ్‌ఓడీ నుంచి ఆమోదం లభించలేదనే కారణంతో, విద్యార్థి పరీక్ష రాయకుండా నిరోధించకూడదని స్పష్టం చేశారు. థీసిస్‌ను ఆమోదించకుండా హెచ్‌ఓడీలు విద్యార్థులను వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డెహ్రాడూన్, పాటియాలా, భోపాల్ వంటి చోట్ల విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు వెలుగు చూశాయి.

వీకెండ్ నిద్రతో గుండెకు మేలు!

న్యూఢిల్లీ: ఆధునిక జీవనశైలి నిద్రపోయే సమయాలను మార్చేస్తున్నది. పని దినాల్లో నిద్ర కరువవుతున్నది. దీంతో జనం వారాంతాల్లో ఎక్కువ సమయం నిద్రపోతూ ఉంటారు. పని దినాల్లో కోల్పోయిన నిద్రకు పరిహారంగా వారాంతాల్లో ఇంకొంత ఎక్కువ సమయం నిద్రపోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని బ్రిటన్ బయోబ్యాంక్ అధ్యయనం వెల్లడించింది. యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్, 2024లో సమర్పించిన పరిశోధన నివేదిక ప్రకారం, వారాంతాల్లో ఎక్కువ సమయం మేలుకుని ఉండేవారికన్నా, ఎక్కువసేపు నిద్రపోయేవారికి గుండె జబ్బుల ముప్పు 20 శాతం తగ్గుతుందని తేలింది. చైనా పరిశోధకుడు యాంజున్ సోంగ్ మాట్లాడుతూ, కోల్పోయిన నిద్రకు పరిహారంగా తగినంత సమయం నిద్రపోవడం వల్ల గుండె జబ్బుల ముప్పు తగ్గుతుందన్నారు.

భూమి చుట్టూ విద్యుత్తు క్షేత్రం: నాసా

న్యూఢిల్లీ: భూమి చుట్టూ సూక్ష్మమైన విద్యుత్తు క్షేత్రం ఉన్నట్లు నాసా పరిశోధకులు గుర్తించారు. ఇది దాదాపు కనిపించదని చెప్పారు. గురుత్వాకర్షణ శక్తికి ఎంత ప్రాముఖ్యం ఉందో దీనికి కూడా అంతే ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు మనకు గురుత్వాకర్షణ శక్తి, అయస్కాంత క్షేత్రాల గురించి మాత్రమే తెలుసు. తాజాగా మూడో క్షేత్రం గురించి కూడా మనకు అవగాహన కలుగుతున్నది. భూ ధృవాల నుంచి నిరంతరం ప్రవహించే సూపర్‌సానిక్ సూక్ష్మ కణాల గాలులు అంతుబట్టని రీతిలో ఉంటాయి. ఈ గాలులకు కారణం ఈ యాంబీపోలార్ విద్యుత్తు క్షేత్రమే అయి ఉండవచ్చునని పరిశోధకులు చెప్తున్నారు. కంటికి కనిపించని ఈ విద్యుత్తు క్షేత్రాన్ని గుర్తించడం వల్ల భూమి పైన మాత్రమే జీవరాశి ఎందుకు రూపొందిందో చెప్పవచ్చునని అంటున్నారు.

భారతీయుల్లో ఐరన్, కాల్షియం లోపం

న్యూఢిల్లీ : భారతీయుల ఆహారంలో ఆరోగ్యానికి ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు తగిన స్థాయిలో ఉండటం లేదని తాజా అధ్యయనం అంచనా వేసింది. స్త్రీ, పురుషుల్లో అన్ని వయసుల వారికీ ఈ సమస్య ఉందని తెలిపింది. ఆహారంలో ఐరన్, కాల్షియం, ఫోలేట్ వంటి పోషకాలు తగిన మోతాదులో ఉండటం లేదని వివరించింది. ఈ అధ్యయనం 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమైంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం సహా ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 185 దేశాల్లో ఆహారం ద్వారా 15 మైక్రో న్యూట్రియెంట్స్ వినియోగంపై అంచనాలను వెలుగులోకి తీసుకొచ్చిన తొలి అధ్యయనం ఇదే. ప్రపంచ జనాభాలో 70 శాతం మంది (దాదాపు 500 కోట్ల మంది) తగినంత అయోడిన్, విటమిన్ ఈ, కాల్షియంలను తీసుకోవడం లేదు.

ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చొంటే వికారం!

- *వాంతులు వచ్చినట్టుగా ఉంటుంది*
- *శివసేన మంత్రి తానాజీ వ్యాఖ్యలు*
- *అజిత్‌పవార్ వర్గం తీవ్ర ఆగ్రహం*

ముంబై: మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో విభేదాలు భగ్గుమన్నాయి. క్యాబినెట్‌లోని ఎన్సీపీ మంత్రులపై శివసేన మంత్రి తానాజీ సావంత్ వివక్షాపూరిత వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ సమావేశంలో తాను ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చుంటానని, దీంతో వికారంతో వాంతి వచ్చినట్టుగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ధారాశివ్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తానాజీ వ్యాఖ్యలపై మిత్రపక్ష ఎన్సీపీ మండిపడింది. అలాంటి ప్రకటనలు వినేకంటే ప్రభుత్వం నుంచి బయటకు వెళ్లిపోవడం మంచిదని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎన్సీపీ అధికార ప్రతినిధి ఉమేశ్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బయటకు రావాలని పార్టీ సీనియర్ నేతలను కోరారు. సావంత్ వ్యాఖ్యలపై ఎన్సీపీ(శరద్ పవార్ వర్గం) కూడా స్పందించింది. ఆయన వ్యాఖ్యలను చూస్తుంటే మహాయుతి కూటమికి ఇక ఎన్సీపీ అవసరం లేదన్నట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నది. ఎన్సీపీని బీజేపీ మహాయుతి కూటమి నుంచి బయటకు పంపే సమయం ఆసన్నమైందని తెలిపింది.

మాలీవుడ్‌లో లైంగిక వేధింపులపై నిరసన జ్వాలలు

దోషులకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తున్నదని విపక్షాల ధ్వజం

కొచ్చి/తిరువనంతపురం, ఆగస్టు 30: మలయాళ చిత్ర పరిశ్రమ మాలీవుడ్‌లో కొందరు హీరోయిన్లు, నటీమణులపై సహచర నటులు, చిత్రపరిశ్రమకు చెందిన వారే లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతాలు బయటపడటంతో పినరయి విజయన్ ప్రభుత్వంపై విపక్షాలు మండిపడుతున్నాయి. చలనచిత్ర పరిశ్రమలో వేధింపులపై విచారణకు నియమించిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక సమర్పించినా, పలువురు నటీమణులు తమను వేధించిన నటులు, దర్శకులు, ఇతరుల పేర్లు వెల్లడించినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విపక్ష నేత వీడీ సతీశన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులకు విజయన్ ప్రభుత్వం రక్షణగా నిలుస్తున్నదని, ఇంత జరిగినా ముఖ్యమంత్రి స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముకేశ్ రాజీనామా చేయాలని, దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొచ్చి, కొల్లాంలో ప్రదర్శనలు నిర్వహించారు. కొల్లాంలో వారు ముకేశ్ ఇంటి ముందు ఆందోళన జరిపి, నినాదాలు చేశారు.

ఐస్‌ల్యాండ్ నైరుతి భాగంలో ఉన్న రిక్‌జేన్స్ ద్వీపకల్పంలోని సండక్స్ అగ్ని పర్వతం బద్దలై ఎర్రటి లావా ఇలా ఉబికి వస్తున్నది.

'12 సార్లు హాజరయ్యా.. ఏడింటిని పట్టించుకోవద్దు'

న్యూఢిల్లీ, ఆగస్టు 30: సివిల్ సర్వీస్ ప్రవేశ పరీక్షకు తాను 12 సార్లు హాజరైనప్పటికీ అందులో ఏడింటిని విస్మరించి ఐదింటిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారిణి పూజా ఖేద్కర్ శుక్రవారం ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. జనరల్ క్యాటగిరీ కింద ఏడుసార్లు రాసిన పరీక్షను విస్మరించి, దివ్యాంగ కోటాలో నాలుగుసార్లు రాసిన పరీక్షలను మాత్రమే పరిగణించాలని వాదించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగ కోటాకు 40 శాతం వైకల్యం ఉండాలని, కానీ తనకు 47 శాతం వైకల్యం ఉన్నట్టు ఆమె కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కిడ్నాపర్‌ను వదిలి రాని బాలుడు!

కన్నతల్లి దగ్గరకు రానంటూ ఏడుపు

జైపూర్, ఆగస్టు 30: కన్న ప్రేమ కన్నా పెంచిన ప్రేమ చాలా గొప్పదని అంటారు. దానిని నిజం చేస్తూ 14 నెలల క్రితం కిడ్నాపైన పిల్లవాడు కిడ్నాపర్‌ను వదిలి కన్న తల్లి వెంట వెళ్లనంటూ ప్రతిఘటించిన ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. యూపీలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సస్పెండైన తనుజ్ చాహర్ గత ఏడాది జూన్‌లో 11 నెలల పిల్లాడిని కిడ్నాప్ చేసి ఇంటికి తెచ్చాడు. ఇప్పుడు ఆ పిల్లాడికి రెండేళ్లు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పిల్లాడిని తల్లికి అప్పగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ బాలుడు తనుజే తన తండ్రి అనుకుని అతడిని వదిలి రావడానికి నిరాకరిస్తూ గట్టిగా పట్టుకుని ఏడవడం ప్రారంభించాడు. దీంతో తీవ్ర ఉద్వేగంతో తనుజ్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నాడు. పిల్లాడితో పాటు అతని కన్నతల్లిని తన వద్దే ఉండమని కోరాడు. దానికి ఆమె తిరస్కరించింది. కాగా, పిల్లాడిని అపహరించుకు వచ్చిన తర్వాత పోలీసులకు దొరక్కుండా తనుజ్ సాధువుగా వేషం మార్చుకుని యమునా నది ప్రాంతంలోని బృందావన్ పరిక్రమ్ మార్గ్ సమీపంలో నివసిస్తున్నాడు.